## క్లుప్తంగా

### మహనీయుడు రామ్‌రావ్ మహరాజ్



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

**ముధోల్:** లంబాడీల జీవితాల్లో వెలుగుల కోసం కృషి చేసిన మహనీయుడు రామ్‌రావ్ మహరాజ్ అని ఎమ్మెల్యే రామారావుపటేల్ పేర్కొన్నారు. మండలంలోని విఠోలితండా గ్రామంలో సోమవారం ఆయన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బాబు సింగ్‌మహారాజ్, బీజేపీ నాయకులు తదితరులున్నారు.

### లక్ష్మీ నృసింహుడికి పూజలు



దర్శించుకుంటున్న కల్లెడ గ్రామస్తులు

**కడెం:** మండలంలోని దోస్త్‌నగర్ శివారులోని ఆటవీ ప్రాంతంలో కొండపై కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామిని సోమవారం గ్రామస్తులు దర్శించుకున్నారు. ఆదివాసీ పూజారి కస్తూరి నర్సయ్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆనంతరం అన్నదానం నిర్వహించారు.

### పంటల వివరాల నమోదు



ధర్మారంలో వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో పవిత్ర

**లక్ష్మణచాంద:** గ్రామాల్లో పంటల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఏవో ప్రవీణ్ కుమార్ సూచనలతో ధర్మారం గ్రామంలో ఏఈవో పవిత్ర, వడ్యాల్‌లో సంతోష్, లక్ష్మణచాందలో ఉమా మహేశ్వరి సోమవారం పంటల నమోదు చేపట్టారు. క్షేత్రస్థాయిలో రైతులు పంటలను పరిశీలించి, సాగు విస్తీర్ణం తదితర వివరాలను నమోదు చేశారు.

### మొక్కలను సంరక్షించాలి



మొక్కను నాటుతున్న అధికారులు

**కుంటాల:** నాటిన మొక్కలు సంరక్షించాలని ఏపీవో గట్టుపల్లి నవీన్ పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం కుంటాల గజ్జలమ్మ ఆలయ ఆవరణలో 200 మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి రాజబాపు, ఎఫ్ఏ రాజేశ్వర్, అర్చకుడు నగేశ్, ఆలయ కమిటీ సభ్యులు తాటి శివ, కళ్యాణ్ గజేందర్, పీరాజి పాల్గొన్నారు.

### వాహనదారులూ.. జర జాగ్రత్త..!



**భైంసాటౌన్:** 'వాహనదారులూ.. జరజాగ్రత్త..'అని ఓ చెట్టు కొమ్మ ప్రమాద హెచ్చరిక చేస్తున్నట్లు అనిపిస్తోంది. పైచిత్రాన్ని చూస్తే.. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద, ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే మార్గంలో బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై దృశ్యమిది. రోడ్డుపై గుంత ఏర్పడడంతో నీరు నిలిచింది. దీంతో గుంత గమనించక వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశముందని భావించిన స్థానికులు కొందరు ఇలా చెట్టుకొమ్మను ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు రోడ్డుపై గుంతను పూడ్చివేయాలని, రోడ్డుపై నీరు నిలవకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

### తోపుడు బండ్ల తొలగింపు

**నిర్మల్‌టౌన్:** జిల్లాకేంద్రంలోని వివేకానంద చౌక్, మయూరి హోటల్, కిసాన్ షాపింగ్ మాల్ వరకు ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, దుకాణాల బోర్డులను మున్సిపల్ సిబ్బంది సోమవారం జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బందులు కలిగించొద్దన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు సుమలత, నవీన్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

### వైద్యశిబిరం

**లోకేశ్వరం:** మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో ముధోల్ భారతి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యుడు మల్లికార్జున్, సిబ్బంది 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

# 'పచ్చిరొట్ట'తో ప్రయోజనాలు!



పొలంలో సాగు చేసిన పచ్చిరొట్ట

- పెరగనున్న భూసారం
- నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు
- తగ్గనున్న ఎరువుల వినియోగం

**లోకేశ్వరం:** పచ్చిరొట్ట సాగుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. భూసారం పెరగడం, ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. చేనుకి చేవ, రైతుకి అధిక లాభాన్నిచ్చే పచ్చిరొట్ట ఎరువులను రైతులందరూ తప్పనిసరిగా సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ పేర్కొంటున్నారు.

- రసాయనిక ఎరువులు తగ్గించడంతోపాటు నేల ఆరోగ్యం కాపాడడంలో భాగంగా ప్రభుత్వం పచ్చిరొట్ట ఎరువులను ప్రోత్సహిస్తోంది. ఖరీఫ్ పంట కాలానికి ముందే జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసుకోవాలి.
- పశువుల ఎరువులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట పైర్లను పెంచి భూమిలో కలియదున్నాలి. ఈ పద్ధతి పాతదే అయినా ఏరువాకకి 40 రోజుల ముందు తొలకరి వర్షాలకు జీలుగ విత్తనాలను చల్లాలి. నెలన్నర తర్వాత కలియదున్నితే నిస్సారమైన పొలాల్లో సారం పెరగడంతోపాటు అధిక దిగుబడి సాధించవచ్చు.
- సాధారణంగా లెగ్యూమ్ జాతి చెందిన పైర్లు లాభాదాయకంగా ఉంటాయి. పచ్చిరొట్ట పైర్ల వేర్లలో వేరు బుడిపెలుంటాయి. వాటిలో నత్రజని ఉంటుంది. ఈ పైర్లను పొలంలో కలియదున్నినప్పుడు నత్రజని సహజసిద్ధంగా భూమికి అందుతుంది. జీలుగ పైరు లెగ్యూమ్ జాతికి చెందింది. సుమారు 1 నుంచి 1.5 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. ఇందులో ముఖ్యంగా 3.50 శాతం నత్రజని, 0.60 శాతం భాస్వరం, 1.20 శాతం పొటాషియం లభ్యమవుతాయి.
- జీలుగ పైరును 40–45 రోజుల్లో కలియదున్నవచ్చు. తద్వారా ఎకరాక 10–12 టన్నుల పచ్చిరొట్ట భూమికి అందుతుంది.
- జీలుగ వేయడం ద్వారా భూమిలో పేరుకు పోయి చౌడు తగ్గించవచ్చు. ఎకరం విస్తీర్ణంలో చల్లడానికి 12 కిలోల విత్తనం సరిపోతుంది.
- వరి నాటు ముందు పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలి. పూత దశలో అంటే 45 రోజుల తర్వాత కలియదున్నాలి. తర్వాత మొక్కల కాండం గట్టిపడుతుంది.
- దున్నే సమయంలో ఎకరాకు 50–100 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ వేసుకోవాలి. దీంతో పంటకి కావాల్సిన పోషకాలు త్వరగా అందుతాయి.
- పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడానికి భూమిలో తగినంత తేమ, నేలలో కలియదున్నిన తర్వాత మురుగటానికి నీరు అవసరం.
- పచ్చిరొట్ట ఎరువులు కలియదున్నిన వెంటనే చాలామంది రైతులు నాట్లు వేస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. పైరు భూమిలో కలియదున్నిన తర్వాత వారం పాటు మురగనివ్వాలి. దాని ద్వారా హానికారక ఆమ్లాలు తయారవుతాయి. మురుగునీటిని తీసేసి కొత్త నీటిని పెట్టి ఆ తర్వాతే వరినాట్లు వేసుకోవాలి.

#### పచ్చిరొట్ట పైర్లతో లాభాలు..

- పచ్చిరొట్ట ఎరువులు కలియదున్నడం ద్వారా హ్యూమిక్, అసిటిక్ ఆమాల్లు విడుదల అవుతాయి. వీటి మూలంగా భూమి క్షారత్వం తగ్గుతుంది. దానివల్ల ముందుగా ఏర్పడిన చౌడు సమస్యను తగ్గించుకోవచ్చు.
- భూమిలో సూక్ష్మక్రిముల రసాయనిక చర్యల మూలంగా పచ్చిరొట్ట మురగటం ద్వారా మొక్కకు కావల్సిన నత్రజని, భాస్వరం, పొటాషియం, సల్ఫర్ వంటి మూలకాలు అందుబాటులో వస్తాయి.
- భూమి లోపలి పొరల్లో సూక్ష్మక్రిముల వృద్ధి జరిగి భూమి భౌతిక లక్షణాలు మెరుగవుతాయి.

# కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం



లోకేశ్వరంలో పట్టీలు బిగించుకుని రోడ్డుపై వెళ్తున్న కేజీవీల్ ట్రాక్టర్

- కంకరతేలి గుంతలు పడి..
- రాకపోకలకు ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు

**లోకేశ్వరం:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్లు పాడైపోతున్నాయి. నిర్మించి రెండేళ్లు గడవకముందే కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు నడపించడంతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. కంకర తేలి గుంతలు పడడంతో రాకపోకలు సాగించే వాహనదారులతోపాటు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వానాకాలం, యాసంగి సీజన్లలో గ్రామాల్లో రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు నడిపించడంతో కొన్ని నెలలకే గుంతలు పడి దర్శనమిస్తోంది. లోకేశ్వరం–దేగాం, లోకేశ్వరం–నందిపేట్, నిర్మల్–భైంసా 61వ నంబర్ జాతీయ రహదారితోపాటు డబుల్, లింక్ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం సుమారు రూ.100 కోట్లు మంజూరు చేసింది. కొన్ని మార్గాల్లో పనులు పూర్తవగా, మరికొన్ని మార్గాల్లో పనులు నడుస్తున్నాయి. కేజీవీల్స్ ట్రాక్టర్లు విచ్చలవిడిగా నడిపిస్తుండడంతో రోడ్ల మధ్య పగుళ్లు ఏర్పడి దెబ్బతిన్నాయి. కంకరతేలిన రోడ్లపై వెళ్లాలంటే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. 15 ఏళ్లకే మన్నిక ఉండాల్సిన రోడ్లు కేవలం ఒకటి రెండేళ్లకే ధ్వంసమై గుంతలు, పగుళ్లు ఏర్పడుతున్నాయి. అయినా ఎస్‌హెచ్, ఆర్‌అండ్‌బీ, పీఆర్, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



నర్సాపూర్‌లో ఇలా కేజీవీల్ ట్రాక్టర్‌ను తీసుకెళ్తున్న రైతు

#### చర్యలు తీసుకుంటాం

రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లను నడిపితే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం. కేజీవీల్స్‌కు పట్టీలు వేసి ఉపయోగించాలి. కేజీవీల్స్ ట్రాక్టర్లను రోడ్లపై నడపొద్దని గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తాం.

– దిగంబర్, ఏఎస్సై

#### పట్టించుకోవాలి



కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడపడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై నడిపిస్తున్నారు. గుంతలు పడడంతో వాహనదారులకు ఇబ్బంది అయితంది. అధికారులు పట్టించుకోవాలి.

– ఎల్లన్న, మాజీ సర్పంచ్, పంచగుడి

#### అందరూ సహకరించాలి



కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను తారురోడ్లపై నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌తో నడిపితే సీజ్ చేసి జరిమానా విధిస్తాం. రహదారి భద్రతకు అందరూ సహరించాలి.

– మోతీరాం, తహసీల్దార్

# మహోన్నత నేత వైఎస్సార్



భైంసాటౌన్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- ఘనంగా జయంతి
- నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

**భైంసాటౌన్:** దివంగత ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మహోన్నత నేత అని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావుపటేల్ అన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని కమల జిన్నింగ్‌లో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో ఆయన పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓం ప్రకాశ్ లడ్డా, శంకర్‌చంద్రే, రాంచందర్, తదితరులున్నారు.

**కడెం:** దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని లింగాపూర్ గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన పాలనలో ప్రజల్లో చెరగని ముద్రవేశారని పేర్కొన్నారు. నాయకులు మహమ్మద్ సలీం, అబ్దుల్ రహీం, తరి శంకర్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

**కుంటాల:** మహనేత వైఎస్సార్ అని పలువురు అభిమానులు కొనియాడారు. మండలంలోని కల్లూర్‌లో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు డాక్టర్ భోజన్న, ముస్కు ముత్యం, చాంద్సూరి వెంకట్, సుధాకర్, మౌలాసాబ్ తదితరులు పాల్గొన్నారు.

**ముధోల్ :** వైఎస్ఆర్ జయంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి, నాయకులు కిషన్ పటేల్, అజీజ్, దిగంబర్, నాగేష్, అనీష్ తదితరులు పాల్గొన్నారు.



కడెం మండలం లింగాపూర్‌లో..



ముధోల్: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

# 'ఆశా'ల సమస్యలు పరిష్కరించాలి



వైద్యురాలికి వినితిపత్రం అందిస్తున్న ఆశలు



కుంటాలలో వైద్యుడికి వినతిపత్రం ఇస్తున్న ఆశలు

**లోకేశ్వరం:** ఆశ కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం మండల అధ్యక్షురాలు నందకుమారి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యురాలు తేజస్వినికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. ఆశలకు నష్టం కల్గించే పరీక్షను కేంద్రప్రభుత్వం రద్దు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 10న నిర్వహించే నిరసన కార్యక్రమానికి ఆశకార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు. ఆశకార్యకర్తలు కాంత, మంజుల, భోజవ్వ ఉన్నారు.

**కుంటాలలో..**

**కుంటాల:** తమ డిమాండ్లు నెరవేర్చాలని పీహెచ్‌సీ వైద్యుడు దామోదర్‌కు కుంటాలలో ఆశకార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ఆశ కార్యకర్తల మండల కన్వీనర్ ఇంద్రమాల, దేవకి, విజయ, లక్ష్మి సంతోష, అనురాధ, పద్మ, ఉమ, ప్రతిభ, లక్ష్మి, రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### ఓబీసీ మోర్చా అధ్యక్షుడికి సన్మానం



సన్మానిస్తున్న గౌడ సంఘం సభ్యులు

**నిర్మల్‌టౌన్:** ఓబీసీ మోర్చా రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఆనంద్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో జిల్లా గౌడ సంఘం సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, సిద్ధిరాములు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

**సన్మానం**

**నర్సాపూర్(జి):** ఇటీవల పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ కొంద్ర రేఖ- రమేశ్, జెడ్పీటీసీ చిన్న రామయ్య, వైస్ ఎంపీపీ లక్ష్మి-సుధాకర్, ఎంపీటీసీలు మల్లేశ్, నర్సమ్మ, రాజవ్వ, కోఆప్షన్ సభ్యుడు ఫసిలను స్థానిక రైతువేదికలో సోమవారం సన్మానించారు. ఆత్మీయ సన్మానం–వీడ్కోలు సభ ఏర్పాటు చేసి వారిని పూలమాలల వేసి సత్కరించారు. మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు చేసిన సేవలను పలువురు కొనియాడారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవోలు పుష్పలత, వనజ, పశువైద్యాధికారి గోవర్ధన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఇన్‌చార్జి ఏపీవో జగన్నాథ్, సీనియర్ అసిస్టెంట్ అనంత విశ్వేశ్వర్, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి**

**నిర్మల్‌చైన్‌గేట్:** దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు హైదరాబాద్‌లోని మంత్రి సీతక్క క్యాంప్ కార్యాలయంలో జిల్లా దివ్యాంగుల తరపున సోమవారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు సట్టి సాయన్న, సురేందర్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు క్రాంతికుమార్, ఇసక్ అలీ, దివ్యాంగుడు రియాజ్ ఉన్నారు.

### రెయిన్ గేజ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**ఖానాపూర్:** మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఉపాధ్యాయులు సోమవారం రెయిన్‌గేజ్(వర్షమాపకం)పై అవగాహన కల్పించారు. కురుస్తున్న వానకు ఏర్పాటు చేసిన డబ్బాలో సెంటిమీటర్ల పద్ధతిలో వర్షపాతం కొలుస్తారని వివరించారు. ఈ విషయమై వాడిన ప్లాస్టిక్ బాటిల్‌పై సెంటిమీటర్ గుర్తులు రాసి ప్రాక్టికల్ చేసి చూపించారు. హెచ్‌ఎం నరేందర్‌రావు, ఉపాధ్యాయులు శేఖర్, శ్రీనివాస్, అంజయ్య, ఇమ్రాన్, శంకర్, శోభారాణి, దీప్తి తదితరులు ఉన్నారు.

**బెలయ్యనాయక్ నియామకంపై హర్షం**

**ఖానాపూర్:** తెలంగాణ గిరిజన డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా తేజావత్ బెలయ్య నాయక్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో నియమించారని తెలిపారు. గిరిజన సంఘం నుంచి వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

**'రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్'**

**ముధోల్:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసగిస్తోందని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ముత్యపురెడ్డి ఆరోపించారు. రుణమాఫీ, రైతు భరోసా కింద ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ఇప్పటికి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సోమవారం మండల రైతులతో కలిసి స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ ఉప సర్పంచ్ మోహన్, ధర్మపురి శ్రీనివాస్, సాయి ఉన్నారు.

### అ'పూర్వ' సమ్మేళనం




**కుంటాల:** కుంటాల ఉన్నత పాఠశాల 2001-02 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

### దరఖాస్తులకు ఆహ్వానం

**కుంటాల:** కుంటాల ప్రభుత్వ జూనియర్ కళా శాలలో తెలుగు మీడియంలోని మిగిలి ఉన్న బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ ఖాళీల కో సం ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తుకారాం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఇవేం వైద్యసేవలు..!



ఇనుప మంచంపై రోగులు

**భైంసాటౌన్:** పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో సరైన సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. వైరల్ జ్వరాల సీజన్ కావడంతో ఆస్పత్రిలో చేరే రోగులసంఖ్య పెరుగుతోంది. అయితే, వార్డుల్లో మంచాలపై బెడ్లు(పరుపులు)లేకపోవడంతో ఇనుప మంచాలపై రోగులకు వైద్య చికిత్స అందిస్తున్నారు. కొన్ని మంచాలపై బెడ్లు ఉన్నా..బెడ్‌షీట్లు ఉండడం లేదు. అపరిశుభ్రమైన బెడ్లపై పడుకుంటే ఏ రోగం వస్తుందోనని జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

### సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే, ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

**తానూరు:** మండలంలోని ఝరి(బి) గ్రామంలో స మస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. భైంసాలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే రామారావ్ పటేల్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌కు సో మవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలో లోలెవ ల్ వంతెన ఉండడంతో భారీ వర్షాలు కురిస్తే రవా ణా సౌకర్యం నిలిచిపోతోందని, బ్రిడ్జి నిర్మించాలని కోరారు. గ్రామంలో పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలన్నారు. పోస్టాఫీసు సౌకర్యం లేక పింఛన్‌దారులు బోల్సా వెళ్లాల్సి వస్తుందన్నా రు. కరోనా సమయంలో నిలిపివేసిన బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని కోరారు. ఎమ్మెల్యే, ఎంపీ.. సానుకూలంగా స్పందించారు. కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.